



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 900 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# చలం జీవితం – సాహిత్యం

## -4-

తన మహా ప్రస్థానం పుస్తకానికి ఏరికోరి ముందు మాట రాయించుకున్న శ్రీశ్రీ గారు చలం గారి గురించి ఏమన్నారో చూద్దాం. ఇవి 1973 లో విజయవాడ ఆకాశ వాణి కేంద్రంలో ప్రసారం అయిన చలం గారి గురించిన ప్రత్యేక కార్య క్రమం నుండి తీసుకోవడం జరిగింది. ఆనాడు ఆ కార్యక్రమాన్ని నిర్వహించినది బాలాంత్రపు రజనీ కాంతారావుగారు. శ్రీశ్రీ మాటలు

” చాలా మంది అనుకుంటారు. చలంగారు లోకాన్ని నిరాకరించారనీ, వారి ఆలోచనలు ఐహికానికి కాక, ఆముష్మికానికి అంకితమైనాయని. మొదటి సంగతి, ఆయన లోకాన్ని నిరాకరించలేదు. ఈ లోకంలోనే, ఈ లోకంతోనే వున్నారు. 'రమణస్థాన్' ఎక్కడో చంద్ర గోళంలో లేదు. రెండోది చలంగారి దృష్టిలో ఆముష్మికం, ఐహికానికి వ్యతిరేకం కాదు. 50 ఏళ్ళ క్రిందట ఆయన మనస్సు యెంత వాడిగా, వేడిగా ఆలోచిస్తూ ఉండేదో, ఇప్పటికీ అలానే ఆలోచిస్తుంది. ఇప్పుడు కూడా ఈ లోకం గురించే ఆలోచిస్తోంది. అయితే, ఒకప్పుడు ఆ మనస్సులో నుండి కథలూ, నాటకాలూ, మ్యుజింగ్సూ, కనీసం నా ఒక్కడి విషయంలోనైనా సాహిత్య విమర్శా వచ్చాయి.

ఇప్పుడు ఆ మనస్సే లోకాన్ని ఆవరించింది. అది చలంగారి లోపం. చలం కలం గురించిన లోపం. చలం గారిని 20 వ శతాబ్ధపు వేమన యోగిగా అభివర్ణించడం మానలేకపోతున్నాను. ఇద్దరికీ ప్రపంచపు చెడు పోకడల మీద ఒళ్ళు మంట వుంది. అయితే, ఎవరికంటే, ఎవరు ఎక్కువ విరుచుకు పడ్డారో తేల్చుకోలేక పోతున్నాను. ఒక ముఖ్యమైన బేధం మాత్రం స్పష్టమే. వేమన విమర్శ సూటిగా ఉంటే, చలం విమర్శ మేధావి తరహాలో ఉంటుంది. ఇద్దరిలోనూ ఆవేదన సమృద్ధిగా వుంది. ఎటువంటి డొంక తిరుగుడూ లేకుండా, చెప్పినదంతా సూటిగా, గుండెకు గుచ్చుకు పోయే విధంగా చెప్పడం ఇద్దరిలోనూ వున్న విశిష్ట గుణం. ఇందువల్లనే అనుకుంటాను, పండిత లోకం ఇద్దరికీ స్థానం నిరాకరించింది. అయితే, ప్రజలు మాత్రం తమ సొంతం చేసుకున్నారు. ఈ 3,4 వందల సంవత్సరాలలో వేమన పద్యాలు లోకుల కోసమే చాటింపులయినాయి. చలంగారు కొత్తగా కథలు రాస్తున్న తొలి రోజుల్లో, మర్యాదస్తుల పత్రికలేవీ ప్రచురించలేదు. అ రోజుల్లో వేళ్ళ మీద లెక్కపెట్టే పత్రికలే ఉండేవి. అది వేరే విషయం. కుర్రకారు మాత్రం ఏ మారుమూల పత్రికలోనో చలం గారి కథ వుంటే, అది ఏదో విధంగా సంపాదించి, చదవడం జరిగేది. ఈ రోజుల్లో విప్లవ కథలూ, కవిత్వాలూ, ఒకటీ, అరా ప్రచురించిన పత్రికలను 3,4 రూపాయలు పెట్టి చదువుతున్న కుర్రకారులాగా. సోక్రటీసును ఆనాటి ఛాందస వర్గం ఏ కారణం చేత విషం పెట్టి, చంపిందో మనకు తెలుసు. యువతరాన్ని పాడు చేస్తున్నాడు అనేదే కారణం. ఇదే ఫిర్యాదు ఈనాటికీ చలం గారి మీద వుంది. విష ప్రయోగం చెయ్యక పోయినా, చలం సాహిత్యాన్ని విషంగా పరిగణించే ప్రబుద్ధులు ఈనాటికీ వున్నారనే సంగతి మనం మరచిపోకూడదు. దేన్నయితే, ఈ ఛాందసులు కాలకూట విషం అనుకున్నారో, దాన్నే నేటి అభ్యుదయ లోకం, ఆరోగ్య ప్రదాయకమైన అమృతంగా స్వీకరిస్తోంది.

చలం గారితో వ్యక్తిగతంగా నాకు ఎక్కువగా పరిచయం లేదంటే, చాలామంది కి విచిత్రంగా అనిపించవచ్చు. కానీ, యదార్థం. వ్యక్తి పరిచయానికి మించినది మా అనుబంధం. నా మహా ప్రస్థానానికి చలంగారు పీఠిక రాస్తే బాగుంటుందని నేననుకున్న మాట నిజమే. కానీ, దగ్గరుండి రాయించిన వాడు ఉభయ మిత్రుడూ జలసూత్రం రుక్మిణినాథశాస్త్రి. ఒక పది సంవత్సరాల పాటు అముద్రితంగానే చలం గారి రచన వుండిపోవడానికి కారణం, నా మహా ప్రస్థాన గీతాలని అచ్చు వేయడానికి ఏ పబ్లిషరూ ముందుకు రాకపోవడం. పీఠిక అని గానీ, ఉపోద్ఘాతం అని గానీ, శీర్షిక అని గానీ లేనందున చలం గారి రచనకు 'యోగ్యతాపత్రం' అనే శీర్షికను అచ్చు కివ్వాల్సిన తొందరలో నేనే ఇచ్చాను. అప్పటికీ, ఇప్పటికీ కూడా అదొక తొందరపాటు పనిగా నాకు అనిపించదు. ఆధునిక సాహిత్య విమర్శకు ఒక 'మేగ్నా కార్టా' లాంటి ఆ వ్యాసం నిజంగా నాకు యోగ్యతాపత్రమేనని భావిస్తున్నాను.

చలంగారు సృష్టించిన సాహిత్య ప్రపంచంలో స్త్రీ పాత్రలే ఎక్కువగా కనిపిస్తారనీ, సెక్స్ సమస్యల ముందు తదితర సమస్యలు తుడుచుపెట్టుకు పోయాయని అనుకుంటారు. చలంగారి కథల్లోనుంచి, నవలలోనుంచి నాటకాల్లోంచి మరువరాని పురుష పాత్రల జాబితా నేను ఇవ్వగలను. ఇకపోతే చలం గారు చర్చించింది సెక్స్ సమస్య మాత్రమే కాదు.

స్వాతంత్ర సమస్య. యావద్భారతదేశమూ స్వాతంత్ర కోసం పోరాడుతున్న రోజుల్లో...భావ స్వాతంత్రం కోసం తన కలంతో పోరాడిన వీరుడు చలం.

రాజకీయ స్వాతంత్రం సాధించి, ఇంకా ఆర్థిక స్వాతంత్రం కోసం సతమతమవుతున్న మనం చలం మహర్షి ఇది వరకే సాధించిన మానసిక స్వాతంత్రం సాధించడానికి ఇంకా చాలా కాలం పట్టవచ్చు. కానీ, ఆ గమ్యం వైపుగానే మానవ జాతి ప్రయాణం చేస్తున్నది. భవిష్యత్తును చూడాలని బుద్ధి పుట్టినప్పుడల్లా, చలం మహర్షి ఆశ్రమానికి వెళ్ళాలనుకుంటాను. భవిష్యత్తు ఎక్కడో సుదూరంలో లేదనీ, మన మధ్యనే, మనకి అందుబాటులోనే వుందని చెప్పడానికి 'రమణాస్థాన్' లో చలం గారు ఉండడమే కారణం. చలం గారికి నేనెప్పుడు ఉత్తరం రాసినా "చలం మహర్షి" అనే సంబోధిస్తుంటాను. ......కొంపెల్ల జనార్ధనరావు లో చూశాను. ఇప్పుడు చలం గారిలో చూస్తున్నాను. -----శ్రీశ్రీ.

"తన మార్గాన్ని తనే వెతుక్కుంటూ, ఒక వ్యక్తి జీవిత కాలంలో యెంత దూరం ప్రయాణించ గలడో, అంత దూరం ప్రయాణించిన ప్రేమర్షి చలం. " ఈ వాక్యాలు రాసింది చలం గారి గురించి విస్తృతమైన పరిశోధనలు చేసిన డా:వావిలాల సుబ్బారావు గారు.

"నాబ్రతుకు నాది. మీరెవరో ఏదో అనుకుంటారని, కృత్రిమ విలువల ముసుగులు వేసుకోవడం నాకస్సలు ఇష్టం లేదు. ఇలాగే వుంటాను. నేనకున్నదే రాస్తాను. మీ మెప్పుకోసం, మీ పురస్కారాల కోసమో కాదు. నాలో చెలరేగే అశాంతిని వెలిబుచ్చడానికి. నన్ను నడిపించే స్త్రీ లోకం గురించి సంఘర్షించే భావాలను అక్షర బద్ధం చేయడానికి రాశాను. రాస్తున్నాను. రాస్తూనే వుంటాను. "అని నిర్భయంగా చెప్పి, అలాగే వ్రాసి, అలాగే జీవించిన 2o శతాబ్ధపు అత్యంత సంచలనాత్మక, వివాదాస్పద రచయిత చలం గారి కధనం లో తరువాత భాగం....

ఈ భాగంలో చలంగారి ఒక నవలను పరిచయం చేస్తాను. 1920 నుండి 50 వరకూ ఆయన ఉధృతంగా సాహిత్య కృషి చేసిన 3 దశాబ్దాలలో ఆయన రాసిన వివిధ ప్రక్రియలను సూక్ష్మంగా విశ్లేషిస్తే, ఆయన అభిప్రాయాల్లో వచ్చిన ఒక క్రమ పరిణామాన్ని మనం గమనించవచ్చు. మనం గతంలో చూసిన రెండు కధల్లోనే ఆ వ్యత్యాసాన్ని గమనించాం. 1927 లోని మైదానం లో స్త్రీ స్వేచ్చా ప్రణయం, ప్రధాన కథా వస్తువైతే, 1937 లో రాసిన 'బ్రాహ్మణీకం' నవలలో సమాజంలోని అనేక దురాచారాలను ఎండ గట్టారు. ఇప్పుడు మరో పది సంవత్సరాలు ముందు కెళ్ళి, 1948లో ఆయన రాసిన "జీవితాదర్శం"అనే నవలను పరిచయం చేస్తాను. ఈ జీవితాదర్శం నవలలో కూడా "లాలస"అనే స్త్రీ ప్రధాన పాత్ర. చలంగారు ఈ నవలలో చెప్పినదేమిటంటే, జీవితంలో మానసిక స్వేచ్చా, దానిని మించిన శాంతి, ప్రశాంతత ఇవే ముఖ్యం. భార్యా, భర్త లైనా గానీ ఎవరి పర్సనల్ స్పేస్ వాళ్ళు ఉంచుకోవడం మంచిది. నేనూ, నాదీ, నాకూ అనే 'పొసెసివ్ నెస్' కంటే కూడా పరస్పర గౌరవం నిలబెట్టుకుంటేనే, జీవితంలో ప్రశాంతత దొరుకుతుంది. జీవితాదర్శం శాంతి అనేది తెలుసుకుంటే, సమస్యలు తగ్గించుకోవచ్చు. అని చలం గారి భావనగా ఈ జీవితాదర్శం నవల చదివాక తెలుస్తుంది.

ఈ వాక్యాలు నవలలో యధాతథంగా రాయకపోయినప్పటికీ, ఆయన సృష్టించిన పాత్రలూ, ఆ పాత్రల ద్వారా ఆయన రాసిన సంభాషణలూ, ఆయా సన్నివేశాలూ ఆ భావాలను బలపరుస్తాయి. ఈ నవల రాసిన రెండు సంవత్సరాల తర్వాత చలం గారి వ్యక్తిగత జీవితంలో జరిగిన అతిపెద్ద మలుపు, అరుణాచలం వెళ్ళడం. దానికి ముందు చూపుగా ఈ నవలను భావించ వచ్చు అని విశ్లేషకులు చెబుతూ వుంటారు. ఈ నవల కంటే, ముందుగానే చలంగారు భగవాన్ రమణ మహర్షి గురించి, ఆయనపై తనకున్న విశ్వాసం గురించి వ్యాసాలు రాశారు. శాంతీ, ప్రశాంతీ అనే భావాల గురించి ప్రస్తావించడం ఈ జీవితాదర్శం నవలలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఈ నవలలోని కథా వస్తువుని తెలుసుకోబోయే ముందు ఈ నవల రాసిన 1948 వ సంవత్సరంలో చలంగారి వ్యక్తిగత జీవితం ఎలాంటి మార్పులకు గురయ్యిందో తెలుసుకుందాం. ఆ వివరాలు తెలుసుకుంటే, చలంగారు ఇలాంటి సౌమ్యమైన భావాలతో ఈ 'జీవితాదర్శం' నవలను ఎందుకు రాశారో మనకి ఒక స్పష్టత వస్తుంది. 1937లో "బ్రాహ్మణీకం" నవల రాశాక, ఆ తరువాత 1938 సంవత్సరంలో 'అరుణ' అనే ఇంకో నవల రాశారు. ఆ తర్వాత మరో పదేళ్ళ వరకూ నవల అనే ప్రక్రియలో ఏమీ రాయలేదు. 10 ఏళ్ళ తర్వాత రాసిన నవలే ఈ 'జీవితాదర్శం'. ఆయన రాసిన సాంఘిక నవలలో బహుశా ఇదే చివరిది అని కూడా చెప్పుకోవచ్చు. దీని తర్వాత ఆయన అరుణాచలం వెళ్ళిపోవడం, అరుణాచలంలో వుండగా ఆయన జీసస్ జీవితం ఆధారంగా మరో రెండు నవలలు రాశారు గానీ, సాంఘిక నవలలైతే ఇదే చివరిది. ఈ జీవితాదర్శం నవల రాసిన రోజుల్లో చలంగారు వ్యక్తిగతంగా చాలా సంఘర్షణకు లోనయ్యారు. ఆ సమయంలోనే వాళ్ళ రెండో అబ్బాయి వసంత్ ఎవరికీ చెప్పకుండా ఇంట్లోనుండి వెళ్ళిపోయాడు. ఆ తరువాత ఏమయ్యాడో ఎవరికీ తెలియదు. 1948కి 6,7 సంవత్సరాల ముందు 'లీల' అని ఒకామె వచ్చి, చలం గారితోనే ఉండిపోయింది. ఆమె చలంగారితో సహజీవనం చేశారని చెప్పుకోవచ్చు. ఈ నవల రాసేటప్పటికి, చలం గారికి, లీలగారితో అభిప్రాయ బేధాలు వచ్చాయి. ఆ లీల గారికి తీవ్రమైన అనారోగ్యం కలిగింది. చలం గారి భార్య రంగనాయకమ్మ గారు అంతకు ముందే 3,4, ఏళ్ళ క్రిందట మనశాంతి కోసం అరుణాచలం వెళ్ళిపోయారు.

చలంగారి వదిన గారు డా: రంగనాయకమ్మగారు విజయవాడలోనే ప్రాక్టీసు చేస్తున్నారు. విజయవాడలో మొట్ట మొదటి లేడీ డాక్టర్ ఈమె. ఆవిడే చలం గారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుండేవారు. ఆమె మరణించారు. అప్పటికే చలంగారు ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు అవ్వలేదు. ఇన్ని సంఘర్షణలకు లోనవుతున్న రోజుల్లో ఈ నవల రాశారు. ఇక ఈ నవల లోని కథా వస్తువు విషయానికి వస్తే, ఆయన చాలా నవలలలాగే ఇందులో కూడా ప్రధాన పాత్ర అద్భుత సౌందర్య రాశి. పేరు 'లాలస'. దాదాపు 25 ఏళ్ళు వుంటాయి. అయితే, ఆయన మొదటి నవలలో లాగా స్వేచ్ఛా ప్రణయాన్ని ఇష్టపడే యువతి కాదు. చాలా చురుగ్గా, హుషారుగా వుంటుంది. ఎవరితో మాట్లాడినా , మొదటి సంభాషణ లోనే చాలా ఆత్మీయురాలు అనే భావన కలిగిస్తుంది. వ్యక్తిగా మానసిక స్వేచ్ఛ కోరుకుంటుంది. ఈ

లాలస అనే పాత్రతో పాటుగా మరొక 2,3, ప్రధాన పాత్రలు వుంటాయి. ఈ నవల కథాంశం అంతా కూడా విశాఖపట్నం దగ్గర భీమిలిలో జరుగుతుంది. ఈ నవల రాయడానికి చాలా సంవత్సరాల క్రిందట చలంగారు భీమిలి లో వుద్యోగం చేశారు. చాలా సంవత్సరాల తర్వాత అంటే, చలం గారు మరణించిన తర్వాత అతని పెద్దమ్మాయి సౌరీస్ ఈ భీమిలిలోనే స్థిరపడ్డారు.

చలం గారికి భీమిలి తో వున్న ప్రత్యేక అనుబంధం ఈ నవలలో ప్రతి వాక్యంలోనూ కనిపిస్తుంది. ఈ నవల రాయడం కూడా భీమిలి లోని ఏదో అద్దె ఇంట్లో వుండి రాశారని కొంతమంది చెబుతుంటారు. భీమిలి లోని సముద్రం, కొండలూ, కొండ మీద గుడి, సూర్యోదయాలూ, సూర్యాస్తమయాలూ అద్భుతంగా వర్ణిస్తారు. అలాగే ఈ రచన టెక్నిక్ పరంగా చూస్తే...దీంట్లో చక్కని సస్పెన్స్ చివరి వరకూ కొనసాగిస్తారు. సాంఘిక నవలలో సస్పెన్స్ సరిగ్గా ఇమడదు అనుకుంటాం గానీ, చలం గారు 70 ఏళ్ళ క్రిందటే ఈ నవలలో చూపించారు. అలాగే ఫ్లాష్ బేక్ ఎపిసోడ్స్ ని కూడా ఒకదాని తర్వాత ఒకటి చెబుతూ ఈ సస్పెన్స్ ని చక్కగా వాడుకున్నారు. కాస్త అటూ ఇటూగా 120 పేజీలు వుంటుంది. కానీ, 4,5, వందల పేజీలు చదివిన అనుభూతి కలుగుతుంది.అన్ని సంఘటనలూ, మలుపులూ వుంటాయి.

ఇప్పుడు కథలోకి ప్రవేశిద్దాం. ఈ కథ జరిగినదంతా భీమిలి లోనే గానీ, మొదలయ్యింది మాత్రం అనంతపురం లో. కథలో ప్రధాన పాత్ర పేరు లక్ష్మణ్ సింగ్. తెలుగు వాడే. వయసు 34,35 సంవత్సరాలు వుంటాయి. ఇతను అనంతపురం లో ఒక మాదిరిగా ప్రాక్టీసు వున్న లాయరు. అతని మిత్రుడి పేరు నరసింహారావు. అతనికి కాలేజీ చదువు అయిపోయింది. ఈ మిత్రులిద్దరూ ఒకసారి వేరే మిత్రుల వద్ద కూర్చొని వుండగా, అక్కడ ఒక ఫారిన్ మాగజైన్ కనపడింది. దాంట్లో బీచ్ ఫోటోలు అవీ చూసి, "ఇండియాలో ఇలాంటి బీచ్ లు ఎక్కడ వున్నాయి?" అన్నారు వాళ్ళల్లో ఒకరు. "ఎక్కడో ఎందుకు? విశాఖపట్నం పక్కనే 'భీమిలి' అని వుంది. అక్కడకు వెళ్తే బ్రహ్మాండమైన బీచ్ కనిపిస్తుంది." అన్నారింకొకరు. అది విని ఈ మిత్రులిద్దరూ సామన్లవీ సర్దుకొని, 'ఒక రెండు నెలల పాటు భీమిలి లో వుందాము.' అనుకొని భీమిలి వచ్చారు.

అక్కడ ఒక సత్రంలో దిగారు. ఆ సత్రం లో వుండగా ఈ కథ మొదలవుతుంది. భీమిలి అయితే వచ్చారు గానీ, ఆ మాగజైన్ లో చూసిన అందాలేవి కనిపించలేదు. ఇక్కడ అంతా చేపలు పట్టుకునేవాళ్ళూ, కొంత మంది బ్రిటీష్ వాళ్ళు అంత కన్నా మరేమీ లేదు. "ఇదేమిటీ?ఇంత దూరం వచ్చాం. ఇంత కన్నా మన అనంతపురమే బాగుంది. వెనక్కి వెళ్లి పోదాం" అనుకున్నారు గానీ, కాకపోతే, రెండు నెలలు వుంటాం అని అందరి తోనూ చెప్పాం. ఏం చేద్దామా? అని అనుకుంటూ బీచ్ లో నడచుకొంటూ వెళుతుండగా ఒక విచిత్రమైన వ్యక్తి తారసపడ్డాడు. అతను ఎలా వున్నాడంటే, సూటూ, బూటూ, గాలిలో ఎగిరే టై, ఇంగ్లీష్ టోపీ, చేతిలో బెత్తం, మనిషి లావుగా వున్నాడు. మెలితిరిగిన తెల్లటి మీసాలు. సగం తెల్లజాతి మనిషిలాగ వున్నాడు. నడకలో, చూపులో, మాటలో అమితమైన ఉత్సాహం, స్నేహ భావం. ఏం చేస్తుంటాడంటే, బీచ్ లో ఆ చివరనుండి ఈ చివర వరకూ గబగబా నడుస్తుంటాడు. కనిపించిన ప్రతి వాళ్ళనీ

పలకరిస్తుంటాడు. కొంతమంది దగ్గర ఆగి కబుర్లు చెబుతుంటాడు. ఎక్కువసేపు ఉండడు. ఇంకేదో పని వున్నట్టు మరొకరి దగ్గరకు వెళతాడు. మొత్తానికి ఆసక్తికరంగా కనిపించాడు.

ఒక రోజు అతనంతటఅతనే పలకరించాడు వీళ్ళిద్దరినీ. “ఏమిటి?కొత్త వాళ్ళ లాగా వున్నారు. ఎక్కడ నుండి వచ్చారు?”అని. ఆ మొట్టమొదటి పలకరింపులోనే ఏదో ఆత్మీయత కనిపించింది. అక్కడనుండి వీళ్ళతో కబుర్లు పెంచుకొని, "సత్రం లో ఉంటున్నారా?ఎక్కడ భోజనం చేస్తున్నారు?”అని మళ్ళీ తనే ”ఫలానా చోటుకి వెళ్లి భోజనం చెయ్యండి” అన్నాడు.

“ఇంతకీ మీ పేరేమిటండీ?”అన్నారు. “నా పేరు దేశికాచారి. నేను చెప్పిన హోటల్ కి వెళ్లి, దేశికాచారి పంపించాడు అని చెప్పండి. మీరు ఎంత ఇస్తే, అంత తీసుకుంటారు”అని చెప్పి, హడావుడిగా వెళ్ళిపోయాడు. వీళ్ళకి విచిత్రంగా అనిపించింది. మనిషి ఎంత విచిత్రంగా ఉన్నాడో, పేరుకూడా అంతే విచిత్రంగా వుంది అనుకున్నారు. ఆ హోటల్ కి వెళ్లారు. ఇలా దేశికాచారి పంపించాడు అనగానే అతను ఏమీ మాట్లాడకుండా వీళ్ళు ఇచ్చింది తీసుకున్నాడు. దేశికాచారి ఈ వూర్లో అందరికీ తెలుసు అనుకున్నారు.

మరుసటి రోజు మళ్ళీ దేశికాచారి కనిపిస్తే అన్నారు ”ఈ బీచ్లో మాకేమి అందాలు కనిపించడం లేదు. మేం వెళ్ళిపోదామని అనుకుంటున్నాం”.

“అందం అనేది మనలో వుంటుంది. నేను మీకు అందాన్ని చూపిస్తాను రండి” ప్రతి చిన్న దాంట్లో కూడా కూడా అందాన్ని ఎలా చూడాలో చెబుతూ, అక్కడ కొండ రాళ్ళ మీదకు తీసుకెళ్ళి, నాచు పట్టిన ఒక నీటి గుంటవుంటే, అందులో రెండు చేప పిల్లలను చూపించి,”మీరు అందాన్ని వెతుక్కుంటూ ఎక్కడికో వెళ్ళనవసరం లేదు. ఇక్కడ కూర్చోండి. అటూ ఇటూ చూడకుండా మనసంతా కేంద్రీకరించి, ఈ నాచు ఉన్న ఈ నీటి గుంటను చూడండి. యెంత అందంగా కనిపిస్తుందో. అన్నీ అందంగానే కనపడతాయి చూడ్డం నేర్చుకుంటే”అన్నాడు.

మనిషి యెంత విచిత్రంగా ఉన్నాడో, ఉదాహరణలు కూడా అంత విచిత్రంగా ఇచ్చాడు అనుకున్నారు. అది మొదలు...ఆ బీచ్ , సూర్యాస్తమయం, కొండలూ, పైన చిన్న గుడి ఇవన్ని వాళ్లకు అందంగా కనపడ్డం ప్రారంభించాయి. రోజు వీళ్ళతో సరదాగా మాట్లాడుతుంటే, వీళ్ళకు అనుమానం వచ్చింది. ‘ఎందుకు మనతో ఇంత సరదాగా ఉంటున్నాడు.మనల్ని ఏమైనా అడ్వాంటేజ్ తీసుకుంటాడా?’అనుకున్నారు. ఆ తర్వాత ఒకరోజు “ఈ మధ్య ఆవిడకు ఆరోగ్యం బాగాలేదు. మిమ్మల్ని భోజనానికి పిలుద్దామంటే, ఇప్పుడు బాగానే వుంది. ఈ సాయంకాలం మా ఇంటికి భోజనానికి రండి” అని భోజనానికి తీసుకెళ్ళాడు.

అతని ఇల్లు కొండ మీద ఒక బంగాళా లాగా వుంది. చుట్టూ పూల చెట్లూ, కాయగూరల మొక్కలూ, వెనకాల తోట, ఆవులూ వున్నాయి. ఆ కొండ మీదకు వెళ్ళగానే అద్భుతమైన దృశ్యం దూరంగా సముద్రమూ, కొండలూ కనిపించాయి.

వీళ్ళకు అనుమానం వచ్చింది ' ఏమిటి? మనం అంటే, ఇంత అభిమానం చూపిస్తున్నాడు. భోజనానికి కూడా తీసుకువచ్చాడు.మనల్ని ఏమైనా మోసం చేస్తాడా?' అనుకున్నారు. వీళ్ళ అనుమానాన్ని బలపరుస్తూ తన గురించి చెప్పుకుంటూ " మీరు దేశికాచారి గురించి వినలేదా?దేశికాచారి అంటే, పదేళ్ళ క్రిందట పెద్ద కేసు జరిగింది.అన్ని పేపర్లనోనూ న్యూస్ కూడా వచ్చింది. నేను పదేళ్ళు జైలు కి వెళ్లి వచ్చాను. "అని చెప్పాడు.

లక్ష్మణ్ సింగుకీ, నరసింహారావుకీ మరింత భయం వేసింది. జైలుకి వెళ్లానని చెబుతున్నాడు. మనల్ని పిలిచాడు. మన దగ్గర వున్నా వన్నీ కొట్టేస్తాడా?లేకపోతే, అనంతపురం వచ్చి, మనల్ని ఏమైనా చేస్తాడా?అని అనుకుంటున్నారు. వరండాలో కూర్చో బెట్టి, "ఇక్కడే భోజనం చేద్దాం"అన్నాడు.

వరండాలో వున్న టేబులు మీద లోపలనుండి అన్నీ తీసుకొచ్చి సర్దాడు. వాళ్ళావిడ ఉందోలేదో తెలీదు. బయటకు అయితే, రాలేదు. భోజనం చేస్తున్నంత సేపు ఏవేవో కబుర్లు చెబుతూనే వున్నాడు. "ఇక్కడ నుండి చూడండి. సముద్రం ఎంత బాగుందో. వెన్నెల్లో అయితే ఇంకా బాగుంటుంది. అందుకే నేను ఇక్కడ బంగాళా కట్టుకున్నాను." లోపలకు కేకవేసి "లాల్! నువ్వూ చూస్తున్నావా సముద్రం?" లోపలనుండి ఒక యుక్త వయసులో వున్నా స్త్రీ స్వరం వినిపించింది."చూస్తున్నాను"అని. ఓహో!ఈ ముసలామె గొంతు మాత్రం చిన్నగా వుంది. ఈ ముసలాయనా, ముసలామె, యెంత ఆదర్శ దంపతులో.ఆవిడ మాక్కూడా కనిపించ కుండా లోపలే వుంది. అనుకున్నారు. అయితే, దేశికాచారి భార్యను పిలిచి పరిచయం మాత్రం చేయలేదు. భోజనం అయిపోయాక వచ్చేశారు. అదొక సంఘటన. ఇలాంటి మరో రెండు సంఘటనలు జరిగాయి.

మర్నాడు లక్ష్మణ్ సింగ్ సత్ర లో పడుకొని వుండగా, అతనికి చెవి పోటు వచ్చింది. నరసింహారావుకి ఏం చేయాలో తోచలేదు. అక్కడ వాళ్లకు తెలిసింది ఒక్క దేశికాచారి మాత్రమే. ఆ రాత్రపుడు కొండెక్కి, దేశికాచారి దగ్గర ఏమైనా మందులు వుంటే అడుగుదామని వెళ్ళాడు. అతను వెళ్లేసరికి దేశికాచారి వరండాలో కూర్చొని వున్నాడు. బయట వెన్నెల వుంది. పక్కనే ఒక అమ్మాయి కూర్చొని వుంది.కానీ, ఆ అమ్మాయి చాలా యుక్త వయసులో వుంది. ఇదేమిటి?ఈ ముసలాయనకూ, ఈ యువతికీ సంబంధం ఏమిటి?బహుశా వాళ్ళ అమ్మాయా?బంధువా?లేకపోతే రెండో భార్యా?ఏమీ అర్ధం కాలేదు. వచ్చిన పని చెబితే, మందు ఇచ్చి పంపించేశాడు.కానీ, అమ్మాయిని మాత్రం పరిచయం చేయలేదు.ఈ దేశికాచారి జీవితం అంతా రహస్యంగా ఉన్నట్లుంది.అనుకున్నాడు, అది రెండో సంఘటన.

సరే! మందు వేసుకున్నాడు. చెవిపోటు తగ్గింది. ఆ మర్నాడు బీచ్ లో నడచుకుంటూ వెళుతున్నారు మిత్రులు. ఆరోజు దేశికాచారి కనపడలేదు. చాలా దూరం వెళ్లారు. చీకటి పడిపోయింది. వెనక్కి వస్తున్నారు.వస్తుండగా...హటాత్తుగా ఉన్నట్టుండి సముద్రానికి పోటు వచ్చింది. సముద్ర కెరటాలు ముందుకు వచ్చాయి. వీళ్ళు అలా నడచుకు వచ్చే క్రమంలో ఒక మొగలి పొద దగ్గరకు వచ్చేసి అక్కడ చిక్కుకు పోయారు. సముద్రం నీళ్ళు ఇంకా ముందుకు వెళ్ళాయి. ఇద్దరికీ భయం

వేసింది. ఆ పొదలు పట్టుకొని నరసింహారావు "బాబోయ్! మమ్మల్ని రక్షించండి" అని బిగ్గరగా అరిచాడు. ఇదంతా చీకట్లోనే జరుగుతోంది. అదేమిటో ఒక దేవత ప్రత్యక్ష మైనట్లుగా ఆ పక్కనేవున్న బండ రాయి నుండి ఎవరో ఒక అమ్మాయి వచ్చి "మీరు కొత్త వాళ్ళ లాగా వున్నారు. అటు కాదు ఇటు నడవండి" అని త్రోవ చూపించింది. ఆ పోటు ఉన్న కెరటాల నుండి బయటకు రావడానికి సహాయం చేసింది. బయటకు వచ్చేశారు.ఆ అమ్మాయి వెళ్ళిపోతోంది. చీకట్లో ఆమెని సరిగ్గా చూడలేదు.

ఈ లోగా లక్ష్మణ్ సింగ్ అన్నాడు."అసలు ఆ అమ్మాయి ఒక్కర్తే ఇంత చీకట్లో ఎందుకు వుంది?వెనక్కి ఒక్కర్తే ఎలా వెళుతుంది. నేను వెనక్కి వెళ్లి పలకరిస్తాను"అన్నాడు. "వద్దు..వద్దు...అసలు అమ్మాయో, దయ్యమో తెలీడం లేదు. తెలిసిన అమ్మాయి అయితే, వెళుతుంది లే" నరసింహారావు అంటున్నా వినకుండా లక్ష్మణ్ సింగ్ వెనక్కి వెళ్లి "ఏమండీ!"అని పిలిచాడు. ఆ అమ్మాయి "ఏమిటి?" అంది. "మీరు ఒక్కరే వెనక్కి ఎలా వెళతారు?" అంతలో ఒక మెరుపు మెరిసింది.ఆ మెరుపులో ఆమె ముఖం స్పష్టంగా కనపడింది లక్ష్మణ్ సింగుకి. ఒక్కసారి ఆశ్చర్యపోయాడు. ఈలోపు ఆ అమ్మాయి "నాకేమి పర్వాలేదు. నేను వెళతాను."అని వెళ్ళిపోయింది.

కానీ, అ మెరుపులో కనిపించిన ఆ అమ్మాయి ముఖం లక్ష్మణ్ సింగుని జ్ఞాపకాల్లోకి తోసేసింది. ఎవరు ఈమె?లాలాస లాగా వుంది. లాలస అవునా, కాదా?ఒకవేళ లాలసే అయితే నన్ను గుర్తు పడుతుంది కదా! కనీసం నా గొంతు అయినా గుర్తు పట్టాలి కదా! అయితే, లాలస కాదా?మరి అలాగే కనిపిస్తోందేమిటి? ఆలోచించుకుంటూ జ్ఞాపకాల్లో వెనక్కి వెళ్ళాడు.

'లాలస 4 సంవత్సరాల క్రితం నాకు వుత్తరం రాసింది. కష్టాల్లో వున్నాను నీ దగ్గరకు వస్తాను. అని నేనేమి సమాధానం ఇవ్వలేదు. అయినా బొంబాయిలో వుండాలి కదా! భీమిలి ఎందుకు వస్తుంది? అతనికేమీ అర్థం కావడం లేదు.' ఇక్కడ నుండి చలం గారు కథను ఫ్లాష్ బేక్ కు తీసుకువెళతారు. అసలు లాలస ఎవరు?

లక్ష్మణ్ సింగు మద్రాస్ లో 'లా' చదువుకుంటున్నాడు. అక్కడ లాలస కూడా ఏదో కోర్సు చదువుకుంటున్నది. కాకపోతే, ఆమెను ఒక పెద్ద సెలబ్రిటీ లాగా, హీరోయిన్ లాగా కాలేజీలో అందరూ చూస్తుండేవారు. ఆవిడ ప్రత్యేకత, యేవో ఆసలు రేపుతున్నట్లుగా వుంటుంది. మాట్లాడిందంటే, ఎంతో దగ్గరగా ఉన్నట్లుగా, అతనితో మాట్లాడం తనకు చాలా ఇష్టమైనట్లుగా అన్నట్లుగా మాట్లాడుతుంది. అందుకని ఆమెతో మాట్లాడడానికి కాలేజీలో అందరూ పడి చచ్చిపోయేవారు. లక్ష్మణ్ సింగుకి కూడా ఆమె పరిచయం అయ్యింది. కొన్నాళ్ళ తర్వాత ఆమెను ప్రేమిస్తున్నట్లుగా చెప్పాడు. ఆ అమ్మాయి మాత్రం ఏమీ సమాధానం ఇవ్వలేదు. చాలా హుషారుగా వుండేది. తుళ్ళిపడుతూ, జలపాతంలాగ వుండేది. లక్ష్మణ్ సింగు కి మాత్రం ఏమీ సమాధానం చెప్పలేదు.

ఒకసారి ఎవరో చెప్పారు"లాలస, ఏడమ్స్ అనే కుర్రవాడిని పెళ్లి చేసుకుంటున్నదని." అందరూ వెళ్లారు. కానీ, ఆ పెళ్లి జరగలేదని తరవాత తెలిసింది. ఇలా విచిత్రంగా వుండేది లాలస. అయితే, లక్ష్మణ్ సింగు ఇంకా కాలేజీలో చదువుతూనే వున్నాడు. అతను మాత్రం, లాలస ఆకర్షణ నుండి తప్పించుకోలేకపోయాడు. లాలస చదువు అయిపోయింది. వాళ్ళది తమిళ దేశంలో ఏదో వూరు. ఆ వూరు వెళ్లి, స్వాతంత్రోద్యమం, ఉప్పు సత్యాగ్రహం లాంటివి జరుగుతుంటే, వాటిల్లో పాల్గొనేది. చదువుకున్నది. అందమైన అమ్మాయి .. మిత్రులు వున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకమైన పనులు చెయ్యడం వలన జైల్లో పెట్టారు. లక్ష్మణ్ సింగు ఇవన్నీ గమనిస్తున్నాడు. ఒకసారి లాలస జైల్లో వుండగా వెళ్ళాడు."ఏమిటి?ఇలా వున్నావు. జైల్లో నుండి బయటకు వచ్చాక నిన్ను పెళ్లి చేసుకుంటాను వచ్చేయ్"అన్నాడు. అప్పుడు కూడా ఏమీ సమాధానం చెప్పలేదు. జైలు నుండి ఆమె విడుదల అయ్యింది కానీ, లక్ష్మణ్ సింగుకి తెలియలేదు. మొత్తానికి ఈ పరిచయమూ, ఇన్ని సంఘటనల తర్వాత లక్ష్మణ్ సింగ్ వాళ్ళ వూరు బయలుదేరాడు.

రైలు ఎక్కుతుండగా....గభాలున పరిగెత్తుకుంటూ వచ్చింది లాలస. "నేను కూడా వచ్చేస్తాను మీవూరు"అంది.లక్ష్మణ్ సింగు ఆ మాట కోసం ఎదురు చూస్తున్నాడు గానీ, అతనికి ఏమీ అర్థం కాలేదు. "జైలు కెళ్ళావు కదా! ఏమైంది?" అంటే చెప్పింది " జైలులో అందరూ కూడా  స్వార్ధ పరులు. వీళ్ళ వలన స్వాతంత్రం రాదు.లోపలి వెళ్ళాక ఈ బ్రిటీష్ వాళ్లకి లంచాలు ఇవ్వడం ఇలాంటివి చేస్తున్నారు. "అని  ఏవేవో చెప్పింది.

సరే! ఆమెని తీసుకొని అనంతపురం వెళ్ళాడు. ఇంట్లో వాళ్ళకి లాలసని పరిచయం చేశాడు. అక్కడ ఆయన తన ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. "ఈ అమ్మాయిని వివాహం చేసుకుందామని అనుకుంటున్నాను" అని చెప్పాడు. ఇంట్లో వాళ్లకి ఈ అమ్మాయి వేగంగా ఉండడం, ఆధునికంగా వుండడం పెద్దగా నచ్చలేదు గానీ,"ఎందుకు ఏమీ తెలియని అమ్మాయిని పెళ్లి చేసుకుంటావు?" అన్నారు గానీ, "కాదు" అనడానికి కూడా పెద్దగా కారణం కనిపించలేదు.

దాంతో ఆ అమ్మాయిని "పెళ్లి చేసుకుందాం" అని అడిగాడు. లాలస  'కాదు' అనలేదు. "అవును" అనడానికి ముందు ఏం అన్నదంటే... "చూడు లక్ష్మణ్ సింగ్!నేను చాలా విధేయతగల భార్యని కాకపోవచ్చు. ఇంకా స్పష్టంగా మాట్లాడాలంటే, నేను నీకు ఆదర్శమైన స్త్రీని అనుకుంటున్నావు. నమ్మావు...సరేనా? నువ్వు మాత్రం నాకు ఆదర్శమైన పురుషుడివి కాదు. మాట్లడవేంటి?కష్టంగా ఉందా?అయినా, నిన్నెందుకు పెళ్లి చేసుకుంటున్నానని అనుకుంటున్నావా?ఆదర్శవంతమైన పురుషుడు భూమి మీద లేడు. అని నాకు స్పష్టమైంది. కాబట్టీ, నువ్వే next-best. అలాని ఆదర్శమైన స్త్రీ కూడా లేదు. కానీ, నేనున్నానని నువ్వు నమ్ముతున్నావు. దురదృష్టవంతుడివి. నువ్వు నన్ను డిసప్పాయంట్ చెయ్యలేవు. నేను నిన్ను తప్పకుండా డిసప్పాయంట్ చేస్తాను. ఈనాటి ఈ మాటలు జ్ఞాపకం వుండవు. కానీ, చాలా సీరియస్ గా చెబుతున్నాను. " అలా ఏదో సందేశం ఇచ్చింది.లక్ష్మణ్ సింగ్ ఆ మాటలు వినే స్థితిలో లేదు.

“అయితే, కొన్నాళ్ళు ఆగుదామా?ఒకరినొకరు అర్థం చేసుకుందామా?నిశ్చయం అయాక అప్పుడు పెళ్లి చేసుకుందామా?”అన్నాడు. దానికి లాలస చెప్పింది.”నిశ్చయం అయిందాక కాసుకొని కూర్చుంటే, ఏదీ చెయ్యలేం చచ్చిందాకా. జీవితం అంటేనే రిస్కు తీసుకోవడం.ఒక్క చావే ఏ ప్రయత్నం, ఏ సందేశం, ఏ రిస్కూ లేకుండా నిశ్చితమైన విషయం. పద పెళ్లి చేసుకుందాం”అని అతన్ని ప్రోత్సహించింది.

సరే! ఇద్దరూ వివాహం చేసుకున్నారు. వివాహం చేసుకున్న దగ్గరనుండి లక్ష్మణ్ సింగు కి ఆమె మీద ‘పొసెసివ్ నెస్’. అంటే, అందంగా వుంటుంది. అందరితోనూ మాట్లాడుతుంది. ఎవరితోనైనా మాట్లాడుతుంటే, లక్ష్మణ్ సింగు కి అసూయగా వుండేది.”నువ్వు నాదగ్గరే ఉండవచ్చు కదా! నాతోనే మాట్లాడవచ్చు కదా!”అంటుండేవాడు. ఆయన కోర్టుకు వెళ్ళాక, ఇంట్లో వాళ్లతోటీ, మరుదుల తోటీ, చుట్టాలతోటీ చనువుగా మాట్లాడుతుండేది.లక్ష్మణ్ సింగుకి నచ్చకపోయినా, పెద్ద సమస్యలేవీ రాలేదు.వాళ్ళ సంసారం మామూలుగా నడుస్తున్నది. అలా రెండు సంవత్సరాలు గడిచాయి.

ఇక్కడ కథలోకి మరో పాత్ర ప్రవేశిస్తుంది. ‘మాల్వంకర్’ అనే గాయకుడు అనంతపురం వచ్చాడు. అతనేదో వాద్య సంగీతం చేస్తుంటాడు. కచేరీలు జరిగేవి. వాటికీ లక్ష్మణ్ సింగ్, లాలస కూడా వెళ్ళేవారు.ఒకసారి కచేరిలో ఎదురుగుండా సీట్లలో కూర్చున్నారు. మరి సహజం గానే లాలస అందంగా వుంటుంది.మాట్లాడితే చనువుగా వుంటుంది. ఆ మాల్వంకర్ కూడా అతని గొంతులోనూ, మాటల్లోనూ ఏదో ఆకర్షణ వుంది. అందరూ ఆయన్ని చూడగానే ఆకర్షితులవుతుంటారు. ఆలాంటిది అ మాల్వంకర్, ఎదురుగా వున్న లాలస వైపే చూడడం ప్రారంభించాడు. ఇది నచ్చలేదు లక్ష్మణ్ సింగుకి. ఇంటికి వెళ్ళిపోయారు. తరువాత చెప్పాడు ”మనం ఆ మాల్వంకర్ కచేరికి వెళ్ళవద్దు. నీ వైపు అదోలా చూశాడు.”అన్నాడు.

కానీ, మర్నాడు ఏమైందీ? మాల్వంకర్, లక్ష్మణ్ సింగ్ లేని సమయంలో ఇంటికి వచ్చి”నేను ప్రత్యేకంగా లాలస కోసం కచేరి చేస్తాను”అన్నాడు. ఆ రకంగా లాలసకు దగ్గరయ్యాడు. ఇలా రెండు, మూడు రోజులు జరిగింది. ఇంట్లో వాళ్ళు జరుగుతున్న విషయాలు లక్ష్మణ్ సింగ్ తో చెప్పారు. “నువ్వు లేనప్పుడు వస్తున్నాడు. పాట కచేరి అంటున్నాడు. పాటలు వినిపిస్తున్నాడు” అని. లాలసని అడిగాడు ”ఇదేమిటి?నేను లేనప్పుడు ఎందుకు రానిస్తున్నావు?”అని. "నాకు పాట వినాలనిపిస్తుంది. వస్తున్నాడు. పాట వినిపిస్తున్నాడు” అంది. ఆమె మొదట్లోనే చెప్పింది”నాకు స్వేచ్ఛ అంటే, ఇష్టం. నా ఇష్టం వచ్చినట్టు వుంటాను. నువ్వు డిసప్పాయంట్ అవ్వకూడదని”

మొత్తానికి ఒక 4,5, రోజుల పరిచయానికే లాలస, మాల్వంకర్ తో వెళ్ళిపోవడానికి నిశ్చయించుకుంది. మొత్తం నవలలో ఈ ఒక్క సంఘటనే అంత బలంగా అనిపించలేదు. ఆ కొద్ది పరిచయానికే అలా వెళ్ళిపోవడానికి బలమైన కారణం కనిపించలేదు. మరి చలాన్ని గాఢంగా చదివిన వాళ్ళు ఏమైనా చెబుతారేమో గానీ, నాకైతే, ఆ సన్నివేశం కొంచెం

బలహీనంగా అనిపించింది. ఎందుకంటే, లక్ష్మణ్ సింగ్ కీ, లాలసకీ మధ్య పెద్ద విబేధాలు లేవు. లక్ష్మణ్ సింగు ఆమె బాధలు పెట్టింది కూడా ఏమీలేదు. కాకపోతే, పరస్పర ఆకర్షణ. చెప్పి చూశాడు. "సరే! నీ ఇష్టం"అని వదిలేశాడు.

తమ్ముళ్ళు చెప్పారు "ఏమిటన్నయ్యా! అలా వదిలేస్తావు వదిన్ని. మేం వెళ్లి వాడిని నాలుగు బాదుతాం"అన్నారు. "వద్దు. తనిష్టం వెళ్లిపోతానంది. వెళ్ళనియ్!"అన్నాడు. ఒకరోజు లక్ష్మణ్ సింగ్ ఇంటికి వచ్చేసరికి లాలస ఇంట్లో లేదు. వెళ్ళిపోయింది. ఇదంతా గతం. ఇప్పుడు వర్తమానానికి వస్తే...

లక్ష్మణ్ సింగ్, నరసింహారావు తో చెప్పాడు లాలస గురించి..."నాకు లాలస లాగ అనిపిస్తోంది. మళ్ళా ఎప్పుడన్నా కలిస్తే గనక, తెలుసుకోవాలి"అన్నాడు. మర్నాడు దేశికాచారి బీచ్ లో కనిపించాడు."ఏమిటీ?నిన్న సముద్రపు అలల్లో చిక్కుపడిపోయారట. మా ఆవిడ మిమ్మల్ని కాపాడిందట."అన్నాడు. లక్ష్మణ్ సింగుకి ఒక్క సారి ఆశ్చర్యమనిపించింది. 'ఇదేమిటి?ఆ అమ్మాయి దేశికాచారి భార్యా?ఇంకా నయం లాలస అనుకున్నాను.నేను పొరపాటు పడినట్లున్నాను.' అని మనసులో అనుకొని, "ఓహో! ఆవిడ మీ భార్యా? ఆమె పేరేమిటి?"అన్నాడు.

"నాకు తెలీదు" అన్నాడు దేశికాచారి.

"అదేమిటి?మీ భార్య పేరు మీకు తెలీదా?"

"అదొక కథ లెండి"

"కానీ, ఆమెను మీరు ఏదో పిలుస్తారు కదా!"

" లాల్! అని పిలుస్తాను. కానీ, అది ఆమె పేరు కాదు." అన్నాడు దేశికాచారి. లక్ష్మణ్ సింగ్ ఏమీ అర్థం కాలేదు. ఇంకేం అడుగుతాడు.!? కానీ, అతని అనుమానం మాత్రం తీరలేదు. అయితే, ఆమె ఎప్పుడూ బీచ్ కి రాదు. దేశికాచారి ఒక్కడే వస్తుంటాడు. ఎలా తెలుసుకోవాలి? ఒకరోజు దేశికాచారి అందర్నీ కూర్చోబెట్టి కబుర్లు చెబుతున్నాడు.' ఆ సమయంలో ఇంటికి వెళ్లి, ఆ అమ్మాయి లాలస అవునో కాదో తేల్చుకోవాలి' అనుకుని ఆ బంగ్లాకి బయలుదేరాడు.

మనం పద్య కావ్యాల్లో, వాటిల్లో చూస్తూ వుంటాం. ఏమిటంటే... ఆ సన్నివేశానికీ, భావానికీ సంబంధించిన నడక వాడుతుంటారని...ఉదాహరణకు వసంత రుతువైతే కొన్ని వృత్తాలూ భయంకరమైన సన్నివేశం చూపించాలంటే మరికొన్ని వృత్తాలూ ఇలా...అవన్నీ పద్య కావ్యాల్లో. చలంగారు ఈ నవలలో కూడా అలాంటివి రాశారు. ఇప్పుడు లక్ష్మణ్ సింగ్, లాలస అవునో కాదో తెలుసుకోవడానికి వెళుతున్నాడు చాలా హడావుడిగా. దేశికాచారికి కనపడకుండా వెళ్ళాలి. అతని మానసిక స్థితిని చలంగారు యెంత అద్భుతంగా వర్ణిస్తారంటే, ఆ పేరాలు చదువుతుంటేనే తెలుస్తుంది. లక్ష్మణ్ సింగ్ యెంత ఆత్రుత పడుతున్నాడో. ఇవి చలం గారి మాటలు "ఆమె లాలస అవునో కాదో తేల్చుకోవాలి. తర్వాత ఏమవుతోందో, తర్వాత కథ. రెండూ, మూడు అని లెక్కబెట్టుకొని కూర్చుంటే, ఉత్త లెక్కలే గానీ, అసలు వస్తువులు ఎన్నడూ చేతికి దొరకవు. వెళ్లి...?యెట్లా... ఏం మాట్లాడాలి. ఆలోచించ కూడదు. ఆలోచనలే అన్ని సందేహాలకీ మూలం

అన్నాడు హాలెండ్.అతని వెంట వస్తానని పెద్ద అలలు, ఏమిటీ మనిషి ఇట్లా పరిగెడుతున్నాడనే తొంగి చూసే పురాతన వృక్షాలనీ, ఏ సమస్యలు లేకుండా గుడిసెలకు వెళుతూ పాటలు పాడే యువకుల్ని కన్నెత్తి చూడలేడతను.”

బంగాళా ముందు తలుపు వేసి వుంది. చుట్టూ తిరిగి వెనకి నుండి వెళ్ళాడు.బహుశా వంటింట్లో ఉందేమో?వాళ్ళాయనకు వంట చేస్తున్నదేమో...నౌకర్లు...ఎవరూ లేరే...పోనీలే...సంపెంగ పరిమళాలూ, ఆకుల్ని గలగల లాడించే ఊర పిచ్చుకలూ , వెళ్ళిపోదామా అని ఆలోచిస్తున్న గిజిగాడు, ఎవరు అని కళ్ళతో ప్రశ్నించే నల్ల మచ్చల ఆవు. అతని సరికి రేగిన తేనే తుట్టె. ఇవన్నీ మనసుకి ఎక్కడం” ఇంత హడావుడిగా ఇంటికి వెళ్ళాడు.

తలుపు తీసుకొని లోనికి వెళ్ళాడు. ఏ గది లోనూ కనపడలేదు.చిట్ట చివర బెడ్ రూమ్ లాగా వుంది. సన్నని తెర వుంటే, ఆ తెర తీసుకొని లోనికి వెళ్ళాడు. అక్కడ కూర్చొని వుంది ఆ అమ్మాయి. లోపల చీకటీ, కుర్చీలూ, సితారూ, అవనీంద్ర నాథ్ ఫోటో. ఒకప్పుడైతే ఆగిపోయే వాడే. ఆ అమ్మాయి ఒక్కసారి వెనక్కి తిరిగింది. “ఎవరు నువ్వు?” అంది.

“నువ్వు లాలసవి కదా!?”అన్నాడు.

“లాలస ఎవరు? నేను లాలసని కాదు” అంది.

”నువ్వు అలాగే వున్నావు”

”కాదు, నేను లాలసని కాదు. మీ లాలస ఎవరో నాకు తెలీదు."

”నువ్వలా మాట్లాడవద్దు. మావారు ఇంట్లో లేరు. నువ్వెళ్ళిపో ” అని బలవంతంగా బయటకు నెట్టేసి, తలుపేసేసింది. దాంతోటి లక్ష్మణ్ సింగ్ కి మరింత అనుమానం. మనిషి చూస్తే అలాగే వుంది.కానీ, మాట చూస్తే, నెమ్మదిగా వుంది. అప్పటి లాలస జలపాతం లాగ వుండేది.ఈమె ప్రశాంతంగా వుండే సరస్సు లాగ వుంది. లాలస అయివుండక పోవచ్చు. బహుసా లాలసను పోలిన మనిషా?ఇలా ఆలోచించుకుంటూ సత్రం కి వచ్చేశాడు.

మర్నాడు, దేశికాచారి వీళ్ళు ఉంటున్న గదికి వచ్చాడు. “ఏమిటి?నిన్న మీరు మా ఇంటికి వచ్చారట.లాలస అనుకున్నారట. ఇదిగో తీసుకువచ్చాను. మీరనుకుంటున్న లాలసకీ, మా ఆవిడకీ సంబంధం లేదు. అసలు మా ఆవిడ లాలస కాదు”అని ఆమెతోనే మాట్లాడించాడు. అప్పుడు అడిగాడు. "అసలు లాలస ఎవరు?నువ్వెందుకు ఆత్రుత పడుతున్నావు”అన్నాడు దేశికాచారి. లక్ష్మణ్ సింగ్ జరిగింది చెప్పాడు. ఎందుకు వెళ్ళిపోయింది అంటే, ఏవేవో చెప్పాడు.

“మాకేం సంబంధం లేదు. “అంది ఆ అమ్మాయి. దాంతో మరింత గందరగోళం. మర్నాడు దేశికాచారిని అడిగాడు లక్ష్మణ్ “ఏమండీ మీ భార్య ఏ దేశస్తురాలు?ఏ వూరు వాళ్ళది? ఆమె పుట్టిల్లు?”

“ఏమో నాకు తెలీదు.”

“మరి ఆమె పేరు?”

“అంతకు ముందే చెప్పాను కదా! ఆమె పేరు నాకు తెలీదని”అన్నాడు దేశికాచారి.లక్ష్మణ్ సింగ్ కి అనుమానం మరింత బలపడింది. బహుశా దేశికాచారికి భయపడి చెప్పడం లేదేమో. ‘ఎలా అయినా ఆమె లాలస అవునో, కాదో తేల్చుకుని ఈ ఊరునుండి వెళ్ళాలి’ అనుకున్నాడు. నరసింహారావు తో చెప్పాడు ”ఇక మనం ఈ వూరిలో ఉండవద్దు. ఎలాగైనా ఆమె గురించి తెలుసుకొని వెళ్ళిపోదాం” అన్నాడు.

ఒక రోజు లక్ష్మణ్ సింగ్ ఒక్కడే బీచ్ కు వెళ్ళాడు. వెళ్లేసరికి చీకటి పడుతోంది. ఎవరో ఒక అమ్మాయి, సముద్రంలో దూకి స్నానం చేస్తున్నది. అక్కడకు వెళ్ళాడు ”నువ్వు లాలసవే” అని అరిచాడు.

“నీ లాలస ఎవరో తెలీదు. నేను లాలసని కాదు”అంది ఆ అమ్మాయి. “ లేదు నువ్వే.”అని అతను కూడా నీళ్ళలో దూకాడు. ఆ అమ్మాయి అంది”నువ్వు ఈత రాని వాడివి. మునిగి పోతావు.నీ లాలస ఎవరో, నువ్వెవరో నా వెనకాల పడ్డావు” మొత్తానికి అతన్ని ఆ నీళ్ళలో నుండి రక్షించింది. “నేను రక్షించకపోతే, నువ్వేమైపోయేవాడివి. అని బయటకు తీసుకువచ్చింది. సరిగ్గా అదే సమాయనికి దేశికాచారి వచ్చాడు. “పదండి మా ఇంటికి వెళదాం.”అని ఇంటికి తీసుకెళ్ళి, పక్క గదిలో ఉండమన్నాడు.

ఆ రాత్రి లక్ష్మణ్ సింగ్ పడుకున్న తర్వాత , లాలస అని తను అనుకుంటున్న దేశికాచారి భార్య వచ్చి, తన దగ్గర నిలుచున్నట్లుగా అనిపించింది. కానీ, పొద్దున్న చూస్తే, ఏమీలేదు. ‘ఓహో! ఏదో కల వచ్చింది లే’అనుకున్నాడు. పొద్దున్న లేచాడు. దేశికాచారి ఇంకా నిద్ర లేవలేదు. ఆమె టీ ఇచ్చి, "ఇంక మీరు మీరు వెళ్ళండి. ఆయన అప్పుడే లేవరు.”అంది. వచ్చేశాడు. నరసింహారావు తో చెప్పాడు ”ఆమె లాలసలాగా వుంది. కానీ, కాదంటోంది. నేను ఇక్కడ ఉండలేను, పద వెళ్ళిపోదాం” అని సామాన్లు సర్దుకోవడం ప్రారంభించాడు.

ఇంతలో దేశికాచారి వచ్చాడు. “మీరు వెళ్లి పోతున్నారా? రేపు కదా! మీరు వెళ్ళేది.ఈవాళ రాత్రి మా ఇంటికి భోజనానికి రండి.”అని తీసుకెళ్ళాడు. భోజనం చేస్తున్నారు. దేశికాచారి అన్నాడు”చూడండి. మొన్నటినుండి చూస్తున్నాను. లాలస... లాలస...అంటున్నారు. ఆ అమ్మాయి పేరేమో నాకు తెలీదు. ఆమె నా భార్యే. కానీ, నేను ఇంతవరకూ తన పేరు అడగలేదు. నా కథ కూడా చెబుతాను వినండి." అంటూ తన కథ చెప్పడం మొదలుపెట్టాడు.

– 7,8, ఏళ్ళ క్రిందట నేను జైలుకి వెళ్ళాను. ఒక రెండు లక్షల రూపాయలు ప్రభుత్వానివి మోసం చేశాను. ఆ కారణంగా జైలుకి వెళ్ళవలసి వచ్చింది. అయితే, ఆ డబ్బు నేను ఒకతని దగ్గర దాచాను. నేను జైలుకి వెళ్లి వచ్చేసరికి, నేను ఏ అమ్మాయి కోసమైతే ఆ డబ్బులు దాచానో, ఆ అమ్మాయి మోసం చేసింది. దాంతోటి ఆ డబ్బు తీసుకోవడానికి ఆ మిత్రుడి దగ్గరకు వెళ్ళాను.ఆ మిత్రుడే ‘మాల్వంకర్’ అక్కడే ఇదిగో ఈ అమ్మాయి వుంది. ఆ మాల్వంకర్ తో ఈమె బాధ పడుతోంది. అక్కడ నుండి ఆమె ఎలా బయటకు వెళ్ళిపోవాలా అని ప్రయత్నిస్తుంటే, ఆ పరిస్థితిలో నాతో పాటు వచ్చేసింది. వచ్చినపుడు తన వివరాలు అడిగితే, చెప్పలేదు. భర్త, అనంతపురం లో వున్నాడు అని మాత్రమే చెప్పింది.

"సరే! అయితే, వుత్తరం రాయి" అన్నాను. రాసింది. కానీ, ఆ ఉత్తరానికి సమాధానం రాలేదు. దాంతోటి నాతోనే ఉండిపోయింది. నేను కూడా వివరాలు ఏమీ అడగలేదు. మా ఇద్దరి మధ్యా వేరే సంబంధం కూడా ఏమీలేదు. ఆమెకు నాలో రక్షణ కనిపిస్తోంది. ఆమె వుంటే, నాకు ప్రశాంతత కనిపిస్తోంది. అంత వరకే మేం కలసి జీవిస్తున్నాం. రాత్రి నువ్వు మా ఇంట్లో వున్నప్పుడు చూశాను. లాలస నీ గదిలోకి వచ్చి, నీకు సేవ చేసింది. అప్పుడు తెలిసింది ఈమె లాలస అని. తరవాత అడిగాను. ఇవన్నీ చెప్పింది. దాంతోటి ఇప్పుడు స్థిర పడింది మీ ఇద్దరూ భార్యాభర్తలని. మీ ఇద్దరూ కూడా ఏం చేయాలో  డిసైడ్ చేసుకోండి. లాలస వస్తానంటే, తీసుకెళ్ళి పో! నాకేమి సంబంధం  లేదు. కాకపోతే, ఆమె రాను అంటే, బలవంతం చేయకు. "అని  నరసింహారావు తీసుకొని బయటకు వెళ్ళిపోయాడు.

గదిలో లాలస, లక్ష్మణ్ సింగ్ మాత్రమే మిగిలారు. లాలసని అడిగాడు"సరే! ఇన్నాళ్ళూ.. కాదు...కాదు... అని చెప్పావు. మరి ఇప్పుడు నువ్వేనని తెలిసింది. మరి వెళదాం రా! నేను తీసుకెళతాను."అన్నాడు.

దానికి లాలస " చూడండి...మీరు మంచివారు. గొప్ప హృదయం. నేను ఇంటి నుండి వెళ్లిపోయినపుడు, మీరు ఎంత ఉదారత్వం చూపారో నాకు తెలుసు. కానీ, సముద్రంలో చేపను యెంత ప్రేమించినా, నేల మీద సుఖపెట్టలేము. మీకూ, నాకూ మధ్య గొప్ప ప్రేమా, శృంగారమూ.  నాకూ, ఆయనకూ మధ్య ఎలాంటి ప్రేమా లేదు. విడవలేని తనం, ఆశ, ఉద్రేకమూ ఏవీ లేవు. కానీ,మా మధ్య గొప్ప ఐక్యం, శాంతి. ఎందుకంటే, ఆయన యే పట్టూ, యే ప్రజుడీస్ లేకుండా జీవితాన్ని మధించి, సుఖపెట్టే రహస్యాన్ని కనిపెట్టారు. మీతో వస్తే, మళ్ళీ మొదలు. హక్కుల కోసం, తగాదా, మర్యాదలూ, బంధుత్వాలూ, డబ్బూ, మిత్రులూ. ఈయన తో తగాదా లేదు. చాలా సంతోషంగా నా అభిప్రాయాలూ, నా హక్కులూ, కోర్కెలూ అన్నీ ఆయన చేతికి అప్పజెప్పాను. ఆయనలో ప్రేమకు అతీతమైన శాంతి వుంది. ఎందుకంటే, ఆయనకు కోర్కెల భయాలు లేవు.బాధను తప్పించుకోవడంలో నేర్పరి. కానీ, ఆ బాధను చూస్తే, భయం లేదు. ఆయన హృదయం శాంతి, ఆకాశం మల్లే. గొడవ పడమాకు నేను రాను"అంది లాలస. అక్కడ చుక్కలు పెట్టి, చిట్ట చివరి పేరా రాస్తారు చలం గారు...

"దేశికాచారి తిరిగి వచ్చేటప్పటికి ఒక్కర్తే అక్కడ అరుగు మీద కూర్చొని వుంది. రా! లాలసా! చాలా పొద్దు పోయింది. లాలస లేచి, దేశికాచారి చెయ్యి పట్టుకుంది."సింగూ, నరసింహారావు ఏరి?"అంది. వాళ్ళు వెళ్ళిపోయారు అన్నాడు దేశికాచారి. బొద్దుమల్లెల మధ్య కాలి దారి వెంట దేశికాచారి వెంట నడుస్తోంది లాలస. "నవ్వుతున్నావా?" అడిగాడు. "అవును మీరు తిరిగి వచ్చేటప్పటికి నేను లేకుండా ఉన్నట్లయితే, అలాగే, పొద్దు పోయిందని వెళ్లి, ఒంటరిగా పడుకునే వారు. అవునా?"అంది. "ఊ.." అన్నాడు.

అక్కడతో నవల అయిపోయింది. అంటే, దేశికాచారికి, లాలస మీద ఎలాంటి అధికార భావం గానీ, అలాగే పొసెసివ్ నెస్ గానీ లేదు. ఆమెకు కావాల్సిన స్పేస్ ఆమెకు ఇచ్చాడు. ఇద్దరూ ఒకరి సమక్షంలో ఒకరు శాంతిని చూసుకున్నారు.

'జీవితాదర్శం' అంటే, శాంతి మాత్రమే. జీవితాదర్శం అంటే, ఒకరి మీద ఒకరు అధికారం చెలాయించడం, గాఢమైన ప్రేమా, కాంక్షా ఇలాంటివి కాదు.' అనే భావం వచ్చేలాగా చలంగారు ఈ నవలని ముగిస్తారు. ఈ నవల రాయడానికి 25 ఏళ్ళ ముందు జీవితాదర్శం అంటే స్వేచ్ఛా ప్రణయం తప్పా మరేమీ కాదు అన్న చలంగారు తన ఈ 25 ఏళ్ళ జీవితం నేర్పిన పాఠాలు ఆయన మార్గాన్ని ఎలా మళ్ళించాయి?ఆ ప్రణయ పథం నుండి శాంతి పథానికి మళ్ళడానికి కారణం ఏమిటి అనే విషయాలు ఈ నవలలో కనిపిస్తాయి. అయితే...చలంగారి నిజ జీవితంలో ఏం జరిగింది?ఎందుకు అలా మారారు? ఇవన్నీ తెలుసుకోవడానికి ఆయన జీవిత విశేషాలు తెలుసుకోవాలి. ఇప్పుడు ఆ విశేషాలలోకి వెళదాం....

(కొనసాగింపు వచ్చేనెలలో)

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 ఫిబ్రవరి 11 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

.

COMMENTS